క్లుప్తంగా

ఆసిఫ్‌కు జ్ఞాపిక అందజేత



భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ 'పశ్చిమ' ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్‌కు పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నేత జోసెఫ్ శివమణి, 44వ డివిజన్ నేత పలగాని శివరామ్ కలిసి భారీ చిత్రపటాన్ని (జ్ఞాపిక) బహూకరించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆసిఫ్ ఫొటోలతో ఉన్న జ్ఞాపికలో 'మీ ఇద్దరి కలయిక కలకాలం ఉండాలని' ఆకాంక్షిస్తున్నట్లు చిత్రపటంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సరగడ శంకరరెడ్డి, ఉండేల శ్రీనివాస్ రెడ్డి, జీ ఆనంద్, సుబ్రహ్మణ్యం, జ్ఞానయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న సన్నిధిలో పూర్ణాహుతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం పూర్ణాహుతిని అత్యంత వైభవంగా నిర్వహించారు. వన్‌టౌన్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ పలు విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున విష్వక్సేన పూజతో వైదిక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం అంతరాలయంలో నిత్య పూజలు చేశారు. ఉభయదేవేరులతో స్వామివారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలతో శ్రీకృష్ణ మండపంలోకి తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

ధనేకుల కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం



పెనమలూరు: ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి ఉత్తమ సేవలు అందించినందుకు కాకినాడ జేఎన్టీయూ సత్కరించి అవార్డు ప్రదానం చేసింది. కాకినాడలో మంగవారం జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డు స్వీకరించారు. ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో 15 సంవత్సరాలుగా ఆయన ప్రిన్సిపాల్‌గా ఉత్తమ సేవలు అందించి ఎందరో విద్యార్థులకు భవిష్యత్తుకు బాటవేశారు. కాలేజీలో విద్యార్థులకు పరిశోధన, గుణాత్మక విద్య, బోధనా పద్ధతులు, ఉపాధి కల్పన తదితర విషయాల్లో విశేష సేవలు అందించినందుకు జేఎన్‌టీయూ అవార్డు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, డైరెక్టర్లు భవానీప్రసాద్, రవిప్రసాద్, అధ్యాపకులు రవికి అభినందనలు తెలిపారు.

ఉత్తమ ప్రదర్శన ఇన్‌స్టిట్యూట్‌గా ఉషారామ



ఉంగుటూరు: ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఉత్తమ ప్రదర్శన ఇన్‌స్టిట్యూట్‌గా నిలిచిందని ఆ కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం తెలిపారు. జేఎన్‌టీయూ కాకినాడలో మంగళవారం ఫార్మేషన్ డే సందర్భంగా జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఉషారామ కళాశాల ఉత్తమ ప్రదర్శన ఇన్‌స్టిట్యూట్ అవార్డును అందుకుంది. అలాగే టీచర్స్ అప్రిషియేషన్ అవార్డ్స్‌లో కెమిస్ట్రీ విభాగానికి చెందిన డాక్టర్ బీఎన్ శ్రీనివాసరావు అవార్డు అందుకోగా మొత్తం మూడు అవార్డులను ఉషారామ కైవసం చేసుకుంది. అవార్డులు పొందిన ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్, బీఎస్ శ్రీనివాసరావును సుంకర రాంబ్రహ్మం అభినందించారు.

గాయత్రి అమ్మవారికి పూజలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గాయత్రి అమ్మవారి జయంతి వేడుకలు కొండపల్లిలోని మద్విరాట్ విశ్వకర్మ దేవాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వశాంతి కోసం శాంతి హోమం జరిపారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రతినిధి కత్తురోజు రామకృష్ణ, ఆలూరు మల్లికార్జునశాస్త్రి, సతీష్ దంపతులు పాల్గొని హోమాలు నిర్వహించారు.

నిత్యావసరాలు అందజేత

దొనబండ(ఇబ్రహీంపట్నం): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఒడిశా రాష్ట్రానికి చెందిన క్వారీ కార్మికుడు అజిత్ కుటుంబానికి గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి సౌజన్యంతో బియ్యం, కందిపప్పు, నూనె తదితరాలు మంగళవారం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రమాదాలకు గురవుతున్న క్వారీ కార్మికుల కుటుంబాలకు గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి డైరెక్టర్ ఎలీషా అండగా నిలవడం అభినందనీయమన్నారు.

నిరుపయోగంగా వర్మి కంపోస్ట్ యూనిట్లు

- 'పశ్చిమ'లో వృథాగా యూనిట్ల షెడ్లు
- యూనిట్లలో కానరాని మెషిన్లు
- అతి తక్కువ ధరకు లభించే సేంద్రియ ఎరువు కరువే



ఊర్మిళానగర్‌లో నిరుపయోగంగా ఉన్న ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్

భవానీపురం(విజయవాడపశ్చిమ): సేంద్రియ ఎరువు తయారీ కోసం నగరపాలక సంస్థ ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్ల సైట్లన్నీ వృథాగా పడిఉన్నాయి. సుమారు తొమ్మిదేళ్ల క్రితం గట్టు వెనుక ప్రాంతంలోని ఊర్మిళానగర్, కబేళా, భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీ, ప్రియదర్శినికాలనీ, రైతుబజార్లలో ఆన్‌సైట్ వర్మికంపోస్ట్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి చెత్తను పిట్లలో నిల్వ చేసి కంపోస్ట్ చేయగా కొంతకాలానికి అది ఎరువుగా తయారయ్యేది. భవానీపురం రైతుబజార్‌లో పనికి రాని కూరగాయలు, ఆకుకూరలను ప్లాంట్‌లోని పల్వరైజింగ్ మెషిన్ల ద్వారా క్రష్ చేసి కంపోస్ట్ యూనిట్లకు పంపేవారు. ఆయా యూనిట్ల ద్వారా ఏడాదికి సుమారు 8–10 టన్నుల వర్మికంపోస్ట్ (సేంద్రియ ఎరువు) తయారయ్యేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కొంతకాలం వాటిని నడిపినా తర్వాత వీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో అవి మూత పడ్డాయి. నగరపాలక సంస్థకు చెందిన పార్కుల్లో చెట్ల నుంచి రాలిన ఆకులను కంపోస్ట్ చేయడం ద్వారా సేంద్రియ ఎరువు తయారవుతుంది. కానీ ఇప్పుడు రాలిన ఆకులను పోగేసి తగలబెడుతున్నారు. వీఎంసీ కమిషనర్లుగా పలువురు ఉన్నతాధికారులు విధులు నిర్వర్తించినా ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్లపై దృష్టి సారించలేదు. ముఖ్యంగా కంపోస్ట్ ప్లాంట్స్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ మెడికల్ ఆఫీసర్, శానిటరీ ఇనస్పెక్టర్లు వాటి వైపే చూడలేదు. దీంతో లక్షలాది రూపాయలు వృథా అయ్యాయి. నాడు టీడీపీ హయాంలో.. వైఎస్సార్ సీపీ 43వ డివిజన్ కార్పొరేటర్ బట్టిపాటి సంధ్యారాణి వర్మికంపోస్ట్ యూనిట్లను వినియోగంలోకి తీసుకురావాలని వీఎంసీ అధికారులను కోరినా వారి నుంచి స్పందన లేదు.

గట్టువెనుక యూనిట్లన్నీ మూసివేతే

గట్టువెనుక ప్రాంతంలోని అన్ని ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్లన్నీ మూతపడ్డాయి. ఊర్మిళానగర్ ప్లాంట్‌లో షెడ్, దానికి అనుబంధంగా నిర్మించిన మరో షెడ్ నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఆ ప్లాంట్‌లోని మెషిన్లు ఏమయ్యాయో తెలియని పరిస్థితి. ఇక విద్యాధరపురంలోని కబేళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్ పరిస్థితి కూడా అంతే. భవానీపురం రైతుబజార్‌లోని ప్లాంట్‌కు తాళం వేసి ఏళ్లు గడుస్తున్నాయి. భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్లాంట్ మూతబడి శిథిలావస్థకు చేరుకుంది. నగరపాలక సంస్థకు ఎంత మంది కమిషనర్లు వచ్చినా ఆయా యూనిట్ల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. సంబంధిత అధికారులు కూడా వాటిని కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లలేదు. వారు ప్రజాప్రయోజనాలను పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

సేంద్రియ ఎరువు కరువే

ఇళ్లల్లో మొక్కలు పెంచుకునే వారికి గతంలో ఆన్‌సైట్ కంపోస్ట్ ప్లాంట్ నుంచి అతి తక్కువ ధరకు సేంద్రియ ఎరువు లభించేది. వీఎంసీ పార్కుల్లో ప్లాంట్ల ద్వారా తయారయ్యే సేంద్రియ ఎరువును వాడేవారు. అయితే గట్టు వెనుక ప్రాంత ప్రజలకు సేంద్రియ ఎరువు దొరకని పరిస్థితి నెలకొంది. ఇళ్ల వద్ద నుంచి సేకరించిన తడి చెత్తను తీసుకువచ్చి ప్లాంట్లలో డంప్ చేసేవారు. దానిని మెషన్లలో వేసి క్రష్ చేసి కంపోస్ట్ కోసం నిర్మించిన పిట్లలో వేసేవారు. ప్రస్తుతం తడి చెత్తను అజిత్‌సింగ్‌నగర్‌లోని డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. వర్మి కంపోస్ట్ ప్లాంట్ల నిర్మాణం, నిర్వహణలో అనుభవంగల మద్దుకూరి సుబ్బారావును నగరపాలక సంస్థ గతంలో సలహాదారుగా నియమించుకుంది. ఆ సమయంలో నగరంలో మొత్తం 30 వరకు వర్మి కంపోస్ట్ ప్లాంట్లు ఉండేవి. తద్వారా ఏడాదికి సుమారు 30 టన్నుల సేంద్రియ ఎరువు లభ్యమయ్యేది.



కబేళా ప్రాంగణంలో వృథాగా ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్



హౌసింగ్‌బోర్డ్‌కాలనీ పార్క్‌లో శిథిలావస్థలో ఉన్న ఆన్‌సైట్ కంపోస్ట్ యూనిట్

విదేశాల్లో మెడిసిన్ చదివిన వారికి న్యాయం చేయాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): విదేశాల్లో మెడిసిన్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు ఒక ఏడాది ఇంటర్న్‌షిప్ తర్వాత మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హెల్త్ యూనివర్సిటీ ఎదుట ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్, ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఒక ఏడాది ఇంటర్న్‌షిప్ తర్వాత రిజిస్ట్రేషన్ చేస్తుండగా, మన రాష్ట్రంలో రెండు సంవత్సరాలు చేయాలని చెబుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి. జాన్సన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని చాలా మంది విద్యార్థులు మెడికల్ కౌన్సెలింగ్‌లో సీటు రాక, ప్రైవేటులో ఫీజు కట్టలేక, విదేశాలకు వెళ్లి వైద్య విద్యను పూర్తి చేశారన్నారు. అనంతరం ఎన్ఎంసీ పెట్టిన పరీక్షలో ఉత్తీర్ణులై ఇంటర్న్‌షిప్ ఏడాది పూర్తి చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ మరో ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేయాలని చెబుతున్నారని, ఇది ఏ రాష్ట్రంలో లేదన్నారు. వెంటనే ఫారిన్‌లో మెడికల్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ప్రతినిధి ఎం. సాయికుమార్‌తో పాటు, పలువురు విదేశాల్లో మెడిసిన్ చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

సాక్షి స్పందన

పటమట(విజయవాడతూర్పు): దోమల నివారణకు వీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. నగరంలో దోమల దాడి ఎక్కువగా ఉందని దీనిపై వీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని మంగళవారం 'దోమలు బాబోయ్.. దోమలు' శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన వీఎంసీ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. నగరంలోని ఆయా ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం దోమల మందు ఫాగింగ్ చేశారు. సర్కిల్–3 పరిధిలోని మలేరియా డివిజన్ –4లో సిబ్బంది స్పందించి పటమట పరిధిలోని 10, 11 డివిజన్లలో డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సెక్రటరీ ఆధ్వర్యంలో ఫాగింగ్ చేశారు. ఈ మేరకు వీఎంసీ బయాలజిస్ట్ మాట్లాడుతూ పటమట ప్రాంతంలోని దానయ్య బజారు, జ్యోతివిద్యాలయం వీధులు, రామినేని నగర్, పటమట రైతుబజారు, పీఅండ్‌టీ కాలనీ–3, విజయనగర్ కాలనీ, వివేకానంద కాలనీ, పంటకాల్వరోడ్డు ప్రాంతాల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేశామన్నారు. ప్రతి సోమవారం కల్వర్ట్ ఫాగింగ్, కల్వర్ ఓవర్ స్ప్రేమ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా డివిజన్లలో మంగళ, గురు, శనివారాల్లో హ్యాండ్ ఫాగింగ్, గురు, శుక్రవారాల్లో ఆటో ఫాగింగ్ చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ప్రధాన కాల్వల్లో కల్వర్టుల్లో దోమల నిర్మూలనకు డ్రోన్ ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రేచేసి నూతన విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు.



పటమటలో మంగళవారం సాయంత్రం ఫాగింగ్ చేస్తున్న వీఎంసీ సిబ్బంది

పటమటలో గొలుసుదొంగతనం

పటమట(విజయవాడతూర్పు): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో గొలుసును గుర్తు తెలియని దుండగులు దొంగతనం చేసిన ఘటన పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటమట గురునానాక్ కాలనీ ఫన్‌టైం క్లబ్ రోడ్డు మణికంఠ అపార్టుమెంటులో కొల్లిపర ఉషాకిరణ్ నివసిస్తుంటారు. ఈ నెల 17 తేదీన తన ఇంటి నుంచి గురునానక్‌కాలనీలో ఉన్న ఉషోదయ సూపర్‌మార్కెట్‌లో సరుకులు కొనుగోలుకు నడుచుకుంటూ వెళ్తుండగా అక్కడ ఉన్న ఓ హోటల్ పక్క వీధి నుంచి గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చాడు. ఆమెను చంపేస్తానని, మెడలో ఉన్న గొలుసును ఇవ్వాలని బెదిరించాడు. తన మెడలో ఉన్న 20 గ్రాముల గొలుసును లాక్కుని బండిపై అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలు ఫిర్యాదుతో మంగళవారం పటమట పోలీసులు కేసును నమోదు చేశారు.

దుర్గగుడి చైర్మన్ కర్నాటిపై దాడి చేసిన వ్యక్తికి జైలు

విజయవాడస్పోర్ట్స్: దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబుపై దాడి చేసిన గుంజా కృష్ణకు తొమ్మిది నెలల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ 7వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నాగేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. అజిత్‌సింగ్ నగర్ ప్రాంతంలోని శ్మశానవాటికలో తన తండ్రి సమాధి వద్ద దీపం వెలిగించి వస్తున్న రాంబాబును అక్కడే పని చేసే ఇద్దరు వ్యక్తులు డబ్బులు అడిగారు. వారిద్దరికీ రూ.100 చొప్పున ఇచ్చిన అనంతరం మూడో వ్యక్తి(నిందితుడు గుంజా కృష్ణ) వచ్చి డబ్బులు అడిగాడు. చిల్లర లేదని చెప్పి వస్తున్న రాంబాబుపై గుంజా కృష్ణ గాజు సీసాను పగలగొట్టి దాడి చేశాడు. దాడిలో రాంబాబు పొట్ట ఎడమ భాగంలో గాయమైంది. 2023 నవంబర్ 24వ తేదీన జరిగిన ఘటనపై బాధితుడి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడుని కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.జేమ్స్ కోర్టుకు వాదనలు వినిపించారు. తొమ్మిది మంది సాక్షులను విచారణ చేసిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు కృష్ణకు న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారు.

పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): శాస్త్రీయ పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్.సత్యనారాయణ అన్నారు. ఈ నెల 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకుని సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర జలవనరుల శాఖ నిర్వహించిన వేడుకల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వీటిలో గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. చిత్రలేఖనం పోటీలో యశ్వంత్ (స్పేస్ ప్లే గ్రౌండ్) అభి మనోహర్ (మై థీమ్ స్పేస్ క్రాఫ్ట్), వీనస్ (ద మూన్ సర్ఫేస్)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుసుకున్నారు. అదే విధంగా అంతరిక్ష పరిశోధనల పురోగతిపై జరిగిన వక్తృత్వ పోటీలో నఫీస, నవ సందీప్ ఫస్ట్, సెకండ్ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. బెస్ట్ స్కూల్ కింద అంబేడ్కర్ విద్య అకాడమీకి జ్ఞాపిక బహూకరించారు.

ఈ సందర్భంగా మంగళవారం హైస్కూల్‌లో విజేతలకు అభినందన కార్యక్రమం జరిగింది. విజేతలను అభినందించినవారిలో ప్రధానోపాధ్యాయుడు తరుణ్ బాబు, అంబేడ్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు ఆర్ గోపాలం, సైన్స్ టీచర్లు టీ సుజాత, ఎస్కే షరీఫ్ ఉన్నారు.



పోటీలో గెలుచుకున్న మెమెంటోలు, మెడల్స్‌తో విద్యార్థులు

మహిళలకు రక్షణ కల్పించండి



వన్‌టౌన్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేసి రక్షణ కల్పించాలని, ఘటనకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణరావు అన్నారు. కేబీఎన్ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో కోల్‌కతా వైద్య విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శనను మంగళవారం సాయంత్రం నిర్వహించారు. డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సమాజంలోని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మహిళలకు ముఖ్యంగా విద్యార్థినులపై ఎటువంటి నేరాలు జరగకుండా పటిష్ట వ్యవస్థను రూపొందించాలని కోరారు. కోల్‌కతాలో జరిగిన సంఘటన చాలా దుర్మార్గమన్నారు.

గతం నుంచి ఎటువంటి గుణపాఠాలను నేర్చుకోకుండా సరైన చర్యలు లేకపోవడంతో ప్రస్తుతం ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి, ఎస్ఆర్ఎస్వీ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యకనకదుర్గ, చిట్టూరి హైస్కూల్ ప్రిన్సిపాల్ సుధారాణి, ఎంఎస్ఆర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్యామల తదితరులు పాల్గొన్నారు. ఉమెన్ స్టడీ సెంటర్ కన్వీనర్ శైలజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాంకేతికత మేలు చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సాంకేతికత ప్రజలకు మేలు చేసినప్పుడే దానికి సార్థకత లభిస్తుందని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రోస్పియర్ ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ ప్రదర్శన మంగళవారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ప్రజలకు మేలు చేసే నూతన ఆవిష్కరణలు తీసుకురావాలని సూచించారు. కళాశాల కోశాధికారి రాఘవయ్య మాట్లాడుతూ సెమీ కండక్టర్స్ రంగం.. దేశ పురోగతికి ఎంతో తోడ్పడుతుందన్నారు. విద్యార్థులు ఈ ప్రదర్శన ద్వారా సమాజానికి ఉపయోగపడే పరికరాలు తయారు చేయాలని కోరారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి, విభాగాధిపతి డాక్టర్ ఎం.రంగారావు పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న కమిటీ ప్రముఖులు

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక కేఎల్‌రావునగర్ 47వ డివిజన్ పరిధిలోని పుచ్చలపల్లి లీలా సుందరయ్య మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం నోట్ పుస్తకాలు, స్టేషనరీ వస్తువుల పంపిణీ చేశారు. అనంతరం అన్న వితరణ జరిగింది. కొరగంజి భ్రమరాంబ జయంతితోపాటు డాక్టర్ పిళ్లా నరసింహపాత్రుడు, అధ్యాపకురాలు వెంకటలక్ష్మి (మున్ని) జ్ఞాపకార్థం కొరగంజి భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉంటూ అనేక సేవా కార్యక్రమాలను చేస్తున్న కొరగంజి భాస్కరరావు అభినందనీయుడని కొనియాడారు. నగరాల మహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ పోతిన బేసు కంఠేశ్వరుడు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు పిళ్లా రవి, గుర్రం కొండ, పట్నాయక్, బుల్లబ్బాయి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న శ్రీరామ్ తదితరులు

నగరంలో 'ఆయ్' సందడి

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో ఆయ్ చిత్ర బృందం మంగళవారం సందడి చేసింది. పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని ఓ హోటల్లో టిఫిన్ చేసి, అక్కడకు వచ్చిన వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ చిత్ర హీరో నార్నే నితిన్ మాట్లాడుతూ ఆయ్ చిత్రం విడుదలైన అన్ని చోట్ల పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో సక్సెస్ టూర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో థియేటర్స్‌లో ప్రేక్షకులను కలిసి కృతజ్ఞతలు చెపుతున్నామని, ప్రతిచోట బ్రహ్మరథం పడుతున్నట్లు చెప్పారు. అనంతరం హీరోయిన్ నయన్ సారిక మాట్లాడుతూ ఆయ్ చిత్రం విజయవంతం కావడంతో సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రంలో తాను తెలుగింటి అమ్మాయిలా కనిపించానని, చిత్రాన్ని వీక్షించి సక్సెస్ చేసిన ప్రేక్షకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



'ఆయ్' హీరో హీరోయిన్‌లు నితిన్, నయన్‌సారిక

అందమైన ప్రేమకావ్యం 'సీతారాం సిత్రాలు'

లబ్బీపేట(విజయవాడతూర్పు): పాత రోజులను గుర్తు చేస్తూ పెళ్లి, వీసీఆర్ క్యాసెట్‌పై అల్లిన ఒక అందమైన ప్రేమకథాచిత్రమే సీతారామ్ సిత్రాలు అని ఆ చిత్ర హీరో లక్ష్మణ్ అన్నారు. ఈ నెల 30న విడుదల కానున్న సినిమా అందరినీ ఆకట్టుకుంటుందన్నారు. ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో లక్ష్మణ్ మాట్లాడుతూ తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సమయంలో చిత్ర దర్శకుడు నాగశశిధర్‌రెడ్డి చెప్పిన కథ విని హీరోగా నటించడానికి అంగీకరించినట్లు తెలిపారు. కేవలం రూ.కోటిన్నరతో సినిమా పూర్తి చేశామని, నలుగురు నిర్మాతలు ఈ చిత్రాన్ని అందమైన ప్రేమ కావ్యంగా మలిచారన్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రమోషన్ కార్యక్రమం వేగవంతంగా చేశామని, వెళ్లిన ప్రతి కాలేజీలో యువత తమను ఎంతగానో ఆదరిస్తున్నట్లు పేర్కొన్నారు. దర్శకుడు నాగశశిధర్‌రెడ్డి మాట్లాడుతూ సినిమాల్లో కంటెంట్ ఉంటే చిన్న చిత్రమైన పెద్ద చిత్రమైన తప్పక ఆదరిస్తారనే నమ్మకంతో ఈ చిత్రం తీసినట్లు తెలిపారు. సినిమాలో యూట్యూబ్ ద్వారా అందరికీ చిరపరిచితమైన భ్రమరాంబిక నటించినట్లు చెప్పారు. సమావేశంలో సహ నిర్మాత పవన్‌రాజు, సభ్యులు మహమ్మద్ సలీం, ఇర్ఫాన్, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.



సీతారాం సిత్రాలు చిత్ర హీరో లక్ష్మణ్, దర్శకుడు నాగ శశిధర్‌రెడ్డి, ఇతర సభ్యులు

నగరంలో ఫుట్‌వేర్ పార్క్ ఏర్పాటుకు కృషి



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో పాదరక్షల తయారీ, విక్రయ రంగాలను ప్రమోట్ చేసేందుకు విజయవాడలో ఫుట్‌వేర్‌పార్క్ ఏర్పాటుకు కృషి జరుగుతోందని ఏపీ ఫుట్‌వేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చుక్కపల్లి అరుణ్‌కుమార్ అన్నారు. దీనిపై ఇప్పటికై ప్రతిపాదనలు కేంద్ర కామర్స్ అండ్ ఇండస్ట్రీ మంత్రికి అందజేసినట్లు పేర్కొన్నారు. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల దేశ వ్యాప్తంగా పాదరక్షల పరిశ్రమ జీఎస్టీ పెరుగుదల, బీఐఎస్ నిబంధనల విధింపుతో సంక్షోభాన్ని ఎదుర్కొన్నట్లు తెలిపారు. పాదరక్షలపై 5 శాతం ఉన్న పన్నును 12 శాతానికి పెంచడంతో ఈ పరిశ్రమ నష్టాల ఊబిలో చిక్కుకున్నట్లు తెలిపారు. జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని, వివిధ రాష్ట్రాల పాదరక్షల సంఘాలతో కలిసి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. బీఐఎస్ నిబంధనల నుంచి చిన్న, మధ్య తరహా యూనిట్లు ప్రాథమిక దశలో మినహాయించాలని గతేడాది కాలంగా చేసిన పోరాటం ఫలించి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి వీర్‌ప్రీత్‌సింగ్, అనీల్‌కుమార్ భవానీ, సభ్యులు బీఎస్ కోటేశ్వరరావు, శ్రీనివాసబాబు, పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

అసోసియేషన్ 2024–26 సంవత్సరానికి మేనేజింగ్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చుక్కపల్లి అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా డి భరత్‌కుమార్, వీర్‌ప్రీత్‌సింగ్, కార్యదర్శిగా అనీల్‌కుమార్‌భవానీ, కోశాధికారిగా హెచ్ చంద్రశేఖర్ , జాయింట్ సెక్రటరీలుగా వైవీ రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ కొండపల్లి డివిజన్ కార్యవర్గం ఎన్నిక స్థానిక నాగార్జున విద్యా నికేతన్ పాఠశాలలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవినేని కిషోర్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షురాలిగా దేవినేని జోనీ కుమారి, కార్యదర్శిగా మహ్మద్ హబీబుల్లా (ఆదర్శ విద్యా నికేతన్), కోశాధికారి ఎస్‌వీఎస్ఎస్ ప్రసాద్ (టాలెంట్ హైస్కూల్)తోపాటు మరికొందరిని నూతన కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వివిధ పాఠశాలల యజమానులు వెనిగళ్ల మురళీమోహన్, యెషయా బాబు, సాంబశివరావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.